క్లుప్తంగా

నిండిన కొచ్చెరువు



అలుగుఎక్కి పారుతున్న నీరు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న కొచ్చెరువు నిండింది. రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు చెరువకు నీరు చేరుతుండడంతో అలుగు పారుతుతుంది. ఈ చెరువు నిండితే దిగువకు ఉన్న ఆలమూరు, కొణిదేడు, పాణ్యం గ్రామాలకు సంబంధించి భూగర్భజలాలు పెరుగుతాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

22న గ్రామసభ

ఓర్వకల్లు: మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలో రీ సర్వేకు సంబంధించిన సమస్యపై ఈ నెల 22వ తేదీన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు.ఏదైనా సమస్యలు ఉంటే రైతులు వినతులు అందజేస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతి



నివాళులర్పిస్తున్న సర్పంచ్ శీలమ్మ, ఎంపీడీఓ రఘునాథ్

కర్నూలు రూరల్: మండల పరిధిలోని పసుపుల గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మురళీకృష్ణ (52) శనివారం రాత్రి మృతి చెందారు. ఈయన కొన్నిరోజులుగా మూత్రాపిండాల సమస్యతో కర్నూలులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలే మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం సర్పంచ్ బొగ్గుల శీలమ్మ, కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్, డీఈ కర్రెన్న, ఏఈ ముక్తార్ బాషా, పంచాయతీ కార్యదర్శి హేమంత్ కుమార్ రెడ్డి తదితరులు మురళీకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ భవన్ నిర్మాణానికి నిధుల మంజూరు

కర్నూలు(అర్బన్): నగరంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న బీసీ భవన్ నిర్మాణానికి కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు రూ.2.50 కోట్లను మంజూరు చేయించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం న్యాయవాది చీమల చంద్రశేఖర్‌తో కలిసి ఎంపీ నాగరాజును కలిసి శాలువా కప్పి సన్మానించామన్నారు. త్వరలోనే నిధులు విడుదల అవుతాయని చెప్పారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనకు సిద్ధమవుతామనిఏపీ ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోచమ్మ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో సమ్మెకు వెళ్లిన సమయంలో ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని అభ్యర్థించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.శివలక్ష్మి, ఈశ్వరి బాయ్ ఎంపికయ్యారు. ఇక జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ నుంచి ఒకరినీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేశారు. అలాగే ఆఫీసు బేరర్లుగా రమీజాబీ, సుబేదా, అలివేలమ్మ, జ్యోతి, శారద, వెంకటమ్మ, అనిత, త్రివేణి, మాధవి, దస్తగిరమ్మ, కాంతమ్మ, మహేశ్వరిలను ఎన్నుకున్నారు.

కులవివక్షను నిర్మూలించాలి

కర్నూలు(సెంట్రల్): సమాజానికి కులవివక్ష మంచిది కాదని కేంద్రీయ సామాజిక సమరసత ప్రముఖ్ శ్రీదేవ్‌జీబాయ్ రావత్ అన్నారు. ఆదివారం విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యాలయంలో దక్షిణాంధ్ర సామాజిక సమరసత ప్రాంత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనాతన ధర్మంలో కుల వివక్ష ఉండేది కాదన్నారు. విధర్మీయుల పాలన ప్రారంభమైన సమయంలో వివక్ష ప్రారంభమైనట్లు చెప్పారు. వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రాంతీయ ఉపాధ్యక్షుడు మాలిగి వ్యాసరాజు, సమరసత ప్రముఖ్ వేదిక మహేష్ పాల్గొన్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి

కర్నూలు (టౌన్): ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి పాటుపడాలని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు సూచించారు. సెలవు రోజు ఆదివారం నిర్వహించిన పన్ను వసూలు కేంద్రాలను రెవెన్యూ ఆఫీసర్ జునీద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

గ్రామీణ ప్రజల సేవలకు సెలవేనా...?

- సచివాలయాల సేవలను తగ్గిస్తున్న టీడీపీ ప్రభుత్వం
- నేటికీ ప్రారంభమవ్వని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



సి.బెళగల్ - 2 గ్రామ సచివాలయం

సి.బెళగల్: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న ఊళ్లోనే సచివాలయాల్లో అన్ని సేవలు అందేలే చర్యలు తీసుకుంది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. అయితే అంతకంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు తూట్లు పొడుస్తుంది. ప్రజా సేవలకు కోత విధిస్తోంది. ప్రజలకు మరింతగా అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. ప్రజా సేవలను వరుసగా తగిస్తూ, కేవలం కుల, ఆదాయ, వన్‌బీ తదితర సాధారణ సేవలను మాత్రమే ప్రస్తుతం పొందుతున్నారు గ్రామీణులు. దీంతో అన్ని వర్గాల ప్రజల కూటమి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల సేవలను టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలోనే సేవలు

ఉన్న ఊళ్లోనే ప్రజలకు సకల సేవలు అందజేసేందుకు ప్రతి గ్రామంలో సచివాయం ఏర్పాటు చేసింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. సచివాయాలకు అనుసంధానంగా 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ని నియమించి అన్ని సేవలు ప్రజలకు నేరుగా అందించారు. ఇందులో భాగంగా సి.బెళగల్ మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఏర్పాటు అయ్యాయి. 155 మంది ఉద్యోగులను నియమించారు. ఒక్కొక్క సచివాలయాన్ని రూ.45 లక్షల వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సచివాలయానికి వచ్చి సమస్యలు విన్నవించుకునేలా ఎంతో ఉపయోపడ్డాయి. సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ అనుసంధాన సేవలు, వివిధ ధృవపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ వంటి ఎన్నో రకాలు, ఎంతో ఉపయోగకరమైన సేవలను మండల, పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా పల్లెల్లోనే పొందేవారు గ్రామీణులు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను పక్కనపెట్టిన టీడీపీ ప్రభుత్వం సచివాలయాల సేవలను తగ్గిస్తున్న తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. సచివాలయ సేవలను యథావిధిగా కొనసాగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రైస్ కార్డు దరఖాస్తులు ఎక్కడ ఇవ్వాలి



ఒకప్పుడు ఏవైన పనులు కావలంటే సచివాలయంలో పొందేవాళ్లం. ఇప్పుడు ఏవైనా పథకాలు కావాలంటే ఏమి చేయాలో... ఎవ్వరిని అడగాలో తెలియడం లేదు. నాకు రైస్ కార్డు కావాల్సి ఉంది. ఇంద కోసం ఎవ్వరిని అడిగినా తమకేమి తెలియదు అంటున్నారు. కనీసం ఎక్కడ కూడా సమాచారం చెప్పడం లేదు. ప్రభుత్వం పట్టించుకోకపోతే రైస్ కార్డుకు దరఖాస్తులు ఎవ్వరికి ఇవ్వాలి.

–అరుణ్‌కుమార్, సి.బెళగల్ గ్రామం

పల్లెల్లో సేవలను కొనసాగించాలి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా కొనసాగించాలి. పల్లె ప్రజలకు స్థానికంగా పథకాలను అందించి, ఎక్కడికి అక్కడ వారి సమస్యలను పరిష్కరించడం అనేది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. కూటమి ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం సచివాలయాల్లో సేవలను కొనసాగించాలి.

– సీబీ తులసిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్

వెబ్‌సైట్లను ఓపెన్ చేయాలి



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలను కొనసాగించాలి. ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు కావస్తున్నా ప్రజలకు ఎటాంటి పథకాలు అందడం లేదు. పేద ప్రజలకు ఇది దారుణమైన పరిస్థితి. రైస్ కార్డులతో పాటు, పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్‌లు ఓపెన్ చేసి ప్రజలకు సేవలను అందించాలి. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

– గొర్ల మద్దిలేటి, వార్డు సభ్యుడు, సి.బెళగల్

రేపు 'పొలం పిలుస్తోంది'

ఓర్వకల్లు: మండలంలోని తిప్పాయపల్లె, సోమయాజులపల్లె గ్రామాలలో ఈ నెల 22వ తేదీన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు.

టెట్‌కు 133మంది గైర్హాజరు

పాణ్యం: ఆర్‌జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలో ఆదివారం జరిగిన టెట్ పరీక్షలకు 133మంది గైర్హాజరయ్యారు. శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలో ఉదయం 200మందికి గాను 25మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ-2సుబ్రహ్మణ్యం తెలిపారు. మధ్యాహ్నం 199మంది గాను 27మంది గైర్హాజరయ్యారన్నారు. అలాగే ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలో ఉదయం 280మందికి గాను 53మంది, మధ్యాహ్నం 280మంది గాను 28మంది గైర్హాజరయ్యారని ఆయన వివరించారు.

అట్రాసిటీ కేసు నమోదు

పాణ్యం: కొలురు గ్రామానికి చెందిన బేత చంద్రశేఖర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు మండల కేంద్రం పాణ్యంకు చెందిన చెంచు లింగమ్మ ఇంటి తలుపును బేత చంద్రశేఖర్ తరుచూ తడుతున్నాడు. దీంతో ఆమె తన భర్త మన్నె చెనయ్యతో కలిసి ఎందుకు తలుపు కొడుతున్నారని అడిగేందుకు బేత చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. దీంతో బేత చంద్రశేఖర్ ఆగ్రహంతో మన్నె చెన్నయ్యను తిడుతూ కొట్టారన్నారు. బాధితురాలి చెంచు లింగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన కోట్ల



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : పిడుగు పాటుకు గురై మృతి చెందిన బోయ మంజుల కుటుంబ సభ్యులను ఆదివారం కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. మండలంలోని అనుగొండలో శనివారం సాయంత్రం పొలంలో పని చేస్తుండగా పిడుగు పాటుకు గురై బోయ బాలమద్దిలేటి భార్య మంజుల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మృతదేహానికి ఆదివారం కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించారు. విషయం తెలుసుకున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆసుపత్రి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా వచ్చే సాయాన్ని అందించేందుకు కృషి చేయాలని కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అధికారులను కోరారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పర్ల గ్రామంలో ఆదివారం సర్పంచ్ హనుమక్క ఆధ్వర్యంలో అధికారులు పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ పిడి నాసరెడ్డి, మండల ప్రత్యేక అధికారి దీప్తి, ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, ఎంపీటీసీ శేషన్నతో కలిసి ఎమ్మెల్యే రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు.

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా కార్యక్రమానికి మండల అధికారులు తప్పకుండా హాజరవ్వాలని, గైర్హాజరైతే ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని హెచ్చరించారు.

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పిస్తే 40 రోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

కల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్య పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశేషాచలరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ



కొత్తకోటలో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న అధికారులు



బైన్‌దొడ్డిలో భూమి పూజ నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట, కె.సింగవరం గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో కొత్తకోట గ్రామ సర్పంచ్ శ్రీనివాసులు, ఉపాధి హామీ ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి వలిబేగ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్ : మండలంలోని బైన్‌దొడ్డి, పులకుర్తి గ్రామాల్లో ఆదివారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ గంగరాజు, పులకుర్తి గ్రామ సర్పంచు ప్రవీణ్, ఈఓఆర్డీ మంజుల, ఏపీడీ పక్కీరప్ప, ఏపీఓ మోదీన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ రఘునాథ్

కర్నూలు రూరల్ : పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు గ్రామాల్లో అభివృద్ధి పనులకు అధికారులు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు జయన్న, మాధవస్వామి, డీఈ కర్రెనన్న, ఏఈ ముక్తార్‌బాషా తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీఓ రఘునాథ్ సీసీ రోడ్ల నిర్మాణానికి భూపూజలు నిర్వహించారు.

ప్రమాదకరంగా... వంతెనలు!





కేసీ కెనాల్‌పై పూడూరు గ్రామం వద్ద శిథిలావస్థలో వంతెన



హంద్రీనీవా కాలువపై ప్రహరీలేని వంతెన

కర్నూలు (రూరల్) : జిల్లా కేంద్రం కర్నూలు రూరల్ పరిధిలో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రత్యేకించి వంతెనలు ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో ప్రజలు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. మండల పరిధిలోని పూడూరు గ్రామ సమీపాన కేసీ కెనాల్‌పై, కేతవరం గ్రామ సమీపాన ఉన్న హంద్రీనీవా కాలువపై వంతెనా మరీ ప్రమాదకరంగా ఉన్నాయి. పూడూరు గ్రామ సమీపాన కేసీ కెనాల్‌పై వంతెన శిథిలావస్థకు చేరింది. వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ఈ వంతెన మీదనే ప్రయాణం సాగించాల్సి ఉంది. పాత బ్రిడ్జి కావడంతో భయం, భయంగా రాకపోకలు సాగిస్తున్నారు ప్రజలు. వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణ కట్టడాలు కూలిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా పెనుప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కేతవరం గ్రామ సమీపాన హంద్రీనీవా కాలువపై ఉన్న వంతెన పరిస్థితీ అంతే. ఈ వంతెనపై నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఆయా గ్రామాల ప్రజలు నంద్యాల, బనగానపల్లె, మద్దిలేటి స్వామి తదితర ప్రాంతాలకు వెళ్లాంటే ముందుగా ఈ వంతనెపై నుంచే ఓర్వకల్లు చేరుకోవాల్సి ఉంటుంది. వంతెనకు ఇరువైపులా రక్షణ కట్టడాలు పూర్తిగా తొలిగిపోయాయి. వాహన చోదకులు అదుపుతప్పినా, రైతులు దిగుబడులు తీసుకెళ్లే సమయంలో పొరపాటున ఎద్దులు బెదిరినా పెనుప్రమాదం చవిచూడాల్సిందే. ఇక స్కూల్ బస్సు వెళ్లినప్పుడల్లా విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లుతుంటారు. అధికారులు స్పందించి వంతెనలకు కనీసం మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాత్రి సమయాల్లో భయంగా ఉంటుంది



వంతెనపై రాత్రి సమయాల్లో గ్రామం చేరుకునే సమయాల్లో భయంగా ఉంటుంది. చిమ్మచీకటి వలన వాహనం అదుపు తప్పుతుందేమనని భయపడుతూ ఉంటాం. ఒక్కోసారి వాహనందిగి నడుచుకుంటూ వెళ్తాం. వర్షం కురిసినప్పుడు వాహనం స్కిడ్ అవుతుందేమనని ఆందోళనగా ఉంటుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఎ.రవి, విద్యార్థి, పూడూరు

రక్షణ గోడలు నిర్మించాలి



నిత్యం వందల మంది ప్రయాణం ఈ వంతెనపై చేస్తుంటాం. ఈ వంతెనపై తెలంగాణలోని అలంపూరు ప్రాంతానికి కూడా రాకపోకలు ఉంటాయి. ప్రత్యేకించి రైతులు ఎద్దుల బండ్లతో పోయేప్పుడు చాలా భయపడుతూ ఉంటారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్న ప్రమాదానికి గురి కావాల్సిందే. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బి.లేపాక్షి, రైతు, పూడూరు

స్కూల్ బస్సులకు దినదినగండమే



స్కూల్ బస్సులు, శుభకార్యాలయాలకు వెళ్లే వాహనాలు గార్గేయపురం-కేతవరం వంతెన మీద వెళ్లేటప్పుడు గండంగా భయపడుతుంటాం. వంతెనకు ప్రహరీ లేనందున విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు.

– ఆనందరావు, ఆటోడ్రైవర్, కేతవరం

చాలా ఇబ్బందులు పడుతున్నాం



కేతవరం బ్రిడ్జిపై ప్రయాణం చేసేప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా ఇక అంతే. ఈ సమీప గ్రామాలకు ఈ రహదారే ప్రధానం. ఓర్వకల్లు మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ బ్రిడ్జి మీదుగా పోవాల్సి ఉంది. అధికారులు స్పందించి వంతెనకు కనీసం మరమ్మతులు చేయించాలి.

– బి.భాస్కర్, రైతు, గార్గేయపురం

సీఎం గారూ.. ఉచిత బస్సు హామీ అమలు ఎప్పుడు?

కర్నూలు సిటీ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ఏమైందని, తక్షణమే హామీని అమలు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ సిటీ విభాగం ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో నిరసన తెలిపారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లోని మహిళా ప్రయాణికులతో కలిసి నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పరిగెల మురళీ కృష్ణ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పింస్తోందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు దాటినా హామీని అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆ పార్టీ నాయకులు జిలానీ బాషా, షేక్ ఖాజా హుసేన్, ఎస్.ప్రమీల, వెంకట సుజాత పాల్గొన్నారు.

యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని యూనివర్సిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, ఆర్‌యూ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నత విద్య కుంటుపడిందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత విద్యను అభివృద్ధి చేసి జిల్లా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశాలు కల్పించాలన్నారు. రాయలసీమ యూనివర్శిటీ, క్లస్టర్ యూనివర్శిటీ, ఉర్దూ యూనివర్శిటీలకు నిధులు కేటాయించాలని, ఆయా వర్సిటీ పరిధిలోని కాలేజీల్లో కొత్తగా ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రవేశ పెట్టి, అభివృద్ధికి రూ.600 కోట్లు కేటాయించాలన్నారు. ఆ సంఘం నాయకులు అమర్, రాజు, మౌలాలి, భరత్‌జోష్, శివాజీ, శీను, భాస్కర్ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ కిరణ్ కుమార్ రెడ్డి

గడివేముల: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని పెసర వాయి గ్రామంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద, పాత ముద్దాయిలు, రౌడీ షీటర్లు ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, సంతృప్తి చెందుకుంటే పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. అలాకాకుండా ఘర్షణలకు పాల్పడితే ఇరువర్గాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వడం నేరమని, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జున రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే..అంతే !



తేరుబజార్‌కు వెళ్లే దారిలో రోడ్డు మధ్యలో మురుగునీటి కాల్వపై ఉన్న గొయ్యి



కోటవీధి సాయిబాబా గుడి వద్ద కల్వర్టును పగులగొట్టి వదిలేసిన దృశ్యం

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని తేరుబజార్, కోటవీధిల్లో మురుగునీటి కాల్వలపై ఉన్న కల్వర్టులను గ్రామ పంచాయతీ సిబ్బంది పగులగొట్టి అలాగే వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి కాల్వల్లో పూడిక పేరుకుపోయిన సందర్భాల్లో పంచాయతీ సిబ్బంది కల్వర్టులకు రంధ్రాలు వేసి పూడికలను తొలగిస్తుంటారు. అయితే వాటిపై ఇనుపకంచెలను వేయాల్సిన సిబ్బంది అలాగే వదిలేశారు. రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టులపై ఉన్న గోతులను గమనించకుండా వచ్చే పాదాచారులు, ద్విచక్రవాహనదారులు ప్రమాదాల భారీన పడుతున్నారు. రాత్రి సమయాల్లో కల్వర్టులపై ఉన్న గోతులను గమనించకుండా వెళ్లి ద్విచక్రవాహనదారులు గాయాలకు గురవుతున్నారు. ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు కల్వర్టులపై ఇనుప కంచెలను ఏర్పాటు చేయించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.